సాక్షి
కుమురం భీం

సోమవారం । 8 । మే । 2023



తలసేమియా చంపేస్తోంది!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా తలసేమియా బాధితులున్నారు. వీరికి మంచిర్యాల జిల్లా ఆస్పత్రి, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు.

8లో▸



అనుమానం పెనుభూతమై..

అనుమానం.. క్షణికావేశం.. గంజాయి మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన భార్య మరొకరితో వివాహేతర సంబంధం నెరపుతోందన్న అనుమానంతో ఓ కిరాతకుడు ఆమెను హతమార్చాడు.

10లో▸

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోత ఎక్కువవుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీశాఖల మంత్రి పురుషోత్తం రూపాల జిల్లా పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9వ తేదీన ఉదయం 8 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని మంత్రి దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం స్థానిక పద్మశాలీ భవన్‌లో వివిధ వర్గాల ప్రజలు, కార్యకర్తలతో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎంగార్డెన్స్‌లో ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు అశోక్‌కుమార్, గణపతి, అరుణ్‌లోయా, సుధాకర్, శ్రీనివాస్, రమేశ్, కృష్ణస్వామి, రవి పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించినట్లు సంఘం బాధ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలు ఈనెల 5, 6 తేదీల్లో భద్రాచలంలో జరిగాయని పేర్కొన్నారు. ఇందులో నూతన కమిటీని 34మందితో ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మీడియం బాబురావు తిరిగి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా పూసం సచిన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కోరెంగా మాలశ్రీ, నేర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కోట శ్రీనివాస్ ఎన్నికయ్యారని తెలిపారు. సాగులో ఉన్న అర్హులైన ప్రతీ రైతుకు పోడు పట్టాలు ఇవ్వాలని, జీవో నంబర్ 3ను పునరుద్ధరించి ఉద్యోగాల భర్తీ చేపట్టాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం అడవులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ఉన్న నూతన అటవీ పరిరక్షణ నియమాలు వెనక్కి తీసుకోవాలని, 40 శాతం గిరిజనులున్న గ్రామాలను ఏజెన్సీలో కలపాలన్నారు. ఏజెన్సీ చట్టాలను కాపాడాలని, వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కంటివెలుగు సిబ్బందిని కొనసాగించాలి



హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కంటి వెలుగు ఆప్టోమ్స్

ఆసిఫాబాద్: కంటివెలుగులో పని చేస్తున్న ఆప్టోమ్స్ సేవలను పూర్తి స్థాయిలో కొనసాగించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. ధర్నాలో జిల్లాకు చెందిన పీఎంవోలు, పారామెడికల్ ఆప్తమాలిక్ అసిస్టెంట్లు, నేత్ర వైద్య సహాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎనగంటి ప్రవీణ్‌యాదవ్ మాట్లాడారు. కంటివెలుగు రెండు విడతల్లో తమను వాడుకొని వదిలేశారని ఆరోపించారు. జిల్లాలో కంటి సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ఇద్దరు మాత్రమే రెగ్యులర్ మెడికల్ ఆప్తమాలిక్ అసిస్టెంట్లు ఉన్నారని తెలిపారు. పీహెచ్‌సీకి ఒకరు చొప్పున నియమించి తమకు న్యాయం చేయాలని కోరారు.

'ధర్నా విజయవంతం చేయండి'

కాగజ్‌నగర్‌టౌన్: ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్ఐయూ) ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు.



జిల్లా కేంద్రంలో సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు (ఫైల్)

పోరు ఫలించేనా?

- కొనసాగుతున్న జూనియర్, అవుట్‌సోర్సింగ్ పీఎస్‌ల సమ్మె
- గ్రామాల్లో గాడితప్పుతున్న పాలన

బెజ్జూర్: గ్రామపంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకం. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ను సర్వీస్‌గా పరిగణించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్‌లు) పోరుబాట పట్టారు. డిమాండ్ల సాధనకు విధులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. ఆదివారం సమ్మె తొమ్మిదోరోజుకు చేరింది. దీంతో గ్రామపంచాయతీల పాలన గాడి తప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయి. గ్రామాలు అభివృద్ధి వైపు దూసుకెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం వీరిని నియమించింది. మొదట మూడేళ్ల కాల పరిమితిని విధిస్తూ రూ.15వేల వేతనం చెల్లించింది. 2021 పీఆర్సీ సందర్భంగా వీరి వేతనాన్ని రూ.28,719కు పెంచింది. కాగా, జీవో నంబర్ 26 ద్వారా కార్యదర్శుల ప్రొబెషనరీ పీరియడ్‌ను నాలుగేళ్లు పొడిగించింది. ఆ గడువు కూడా ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. అయినా ప్రభుత్వం వీరిని రెగ్యులర్ చేయకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. కాగా, ఆదివారం సాయంత్రం రాష్ట్ర సంఘంతో ప్రభుత్వం చర్చలు జరపనుందని బెజ్జూర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం బాధ్యులు తెలిపారు.

సీనియర్లతో సర్దుబాటు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా 209 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. 56 మంది అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరితో పాటు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు 59 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని గ్రామపంచాయతీల్లో సీనియర్ పంచాయతీ కార్యదర్శులను పలు జీపీలకు సర్దుబాటు చేసి విధులు అప్పగించారు. దీంతో వీరికి పనిభారం పెరిగింది. ఈ కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది.

సమ్మెతో పనులకు ఆటంకం

పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగడంతో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు పర్యవేక్షణ పూర్తిగా నిలిచిపోయింది. వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణతో పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగడంతో సర్పంచులకు తలనొప్పిగా మారింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి అనుమతుల జారీకి బ్రేక్ పడింది. ప్రధానంగా వేలిముద్రలు పడని వృద్ధులకు ఆసరా పింఛన్లు కార్యదర్శులే ఇవ్వాల్సి ఉండగా, పింఛన్ల పంపిణీలోనూ ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆయా శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం తమను కూడా రెగ్యులర్ చేయాలని జేపీఎస్‌లు డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కరించేదాకా పోరాటం

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం ఆగదని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్పష్టం చేస్తున్నారు. తమను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని కోరుతున్నారు. టీపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నంబర్ 26 ప్రకారం ప్రొబెషన్ డిక్లేర్ చేసి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించేదాకా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఇవీ.. వారి డిమాండ్లు

- విధుల్లో చేరిన నుంచి సర్వీస్ కాలంగా పరిగణించి వెంటనే సీనియర్ అసిస్టెంట్ స్కేల్‌తో రెగ్యులర్ చేయాలి.
- విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.5లక్షలు, క్షతగాత్రులైన వారికి రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.
- ప్రస్తుతం పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబెషనరీ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలి. వారిని కూడా రెగ్యులర్ చేయాలి.
- సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి.
- 317 జీవోతో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలి. పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

ఇబ్బందులు పడుతున్నాం

గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో గ్రామస్తులందరికీ అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలి. వారు విధుల్లో చేరేలా చూడాలి.

– బాలకృష్ణ, చిన్న సిద్దాపూర్

ప్రభుత్వం స్పందించే దాకా..

ప్రభుత్వం అప్పగించిన ప్రతీ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నాం. నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ను ప్రకటించి ప్రభుత్వం మాతో వెట్టిచాకిరీ చేయిస్తోంది. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేసేదాకా సమ్మె కొనసాగిస్తాం.

– శ్రావణ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జనరల్ సెక్రటరీ

అట్టహాసంగా ఆటలు



- క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్
- ఈ నెల 15నుంచి టోర్నీలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు
- జూన్ 2న విజేతలకు బహుమతులు

ఆసిఫాబాద్‌రూరల్: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల సందడి మొదలుకానుంది. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పేరిట మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆటల పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించింది. వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది. ఈ నెల 15నుంచి 31వ తేదీ వరకు క్రీడలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్ ప్రకటించింది. 15–36 ఏళ్ల వారు అర్హులుగా నిర్ణయించిన ప్రభుత్వం విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందించనుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విజేతలకు జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన సీఎం కేసీఆర్ బహుమతులు అందజేయనున్నారు.

15–17 వరకు మండల స్థాయిలో..

సీఎం కప్– 2023లో భాగంగా 11 రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో టోర్నీలు నిర్వహిస్తారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపుతారు. మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్, ఎంపీడీవో మెంబర్ కన్వీనర్, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో లేదా గజిటెడ్ హెచ్‌ఎం, ఎస్ఎస్ఐ, మున్సిపల్ ఏరియాలో కమిషనర్ పీడీ, పీఈటీ సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తారు. వీటిలో 11 క్రీడాంశాల్లో పోటీలు ఉండగా పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో వాలీబాల్, బ్యాడ్మింటన్, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఉంటాయి. జిల్లా స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్, ఎస్పీ వైస్ చైర్మన్, డీవైఎస్‌వో కార్యదర్శి, జిల్లా విద్యాశాఖాధికారి, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

28నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాశాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్ సభ్యులుగా వ్యవహరిస్తారు. 18 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను ఈ నెల 28నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తారు.

క్రీడాకారులకు సీఎం కప్ వరం



సీఎం కప్ గ్రామీణ క్రీడాకారులకు వరం. రాష్ట్ర మంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామీణ క్రీడాకారులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

– మణెమ్మ, జిల్లా యువజన క్రీడాధికారి

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జూన్ 9,10తేదీల్లో రెబ్బెన మండలం గోలేటిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సంపత్, నిర్వాహకులు శ్రీనివాస్‌రావు, బోగె ఉపేందర్, శ్రీధర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని సన్మానిస్తున్న సభ్యులు


వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎమ్మెల్యేను శాలువాతో సత్కరిస్తున్న మహిళలు

కెరమెరి: త్వరగా వంతెన పనులు పూర్తి చేసి ఆదివాసీలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు సూచించారు. ఆదివారం కర్బెతగూడ వాగు వద్ద రూ.2.50 కోట్లతో చేపట్టిన వంతెన పనులను ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్ల క్రితం వంతెన కూలిపోయిందని, వానాకాలంలో మూడు గ్రామాలకు చెందిన ఆదివాసీలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రోగులు, గర్భిణులు సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు వాగుదాటలేక ఇళ్లకే పరిమితమైన రోజులున్నాయని గుర్తు చేశారు. ప్రజలు నిత్యావసరాల కోసం ఇబ్బంది పడ్డారని, సమస్యలన్నింటికీ పరిష్కారంగా నిధులు మంజూరు చేయించి వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నాణ్యతతో, త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సింగిల్‌విండో చైర్మన్ శంకర్, సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావు, కుమురం న్యానేశ్వర్, ఎంపీటీసీ సకారాం తదితరులున్నారు.

20 రోజులుగా 'అండర్ రిపేర్'



జిల్లా కేంద్రంలోని బంక్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ సరిగా లేదు. నిత్యం బంక్ వద్ద పంప్ అండర్ రిపేర్ పేరుతో బోర్డు దర్శనమిస్తోంది. నష్టాల్లో ఉన్న సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు నాలుగేళ్ల క్రితం ఆర్టీసీ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించింది. తొలుత దీనిని ప్రైవేట్ వారికి లీజుకిచ్చారు. లాభాల బాట పట్టడంతో బంక్‌ను ఆర్టీసీ స్వాధీనం చేసుకుని నిర్వహిస్తోంది. బంక్‌లో ప్రతిరోజూ సుమారు 2,500 లీటర్ల పెట్రోల్, 2వేల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతుంటాయి. పట్టణం నడిబొడ్డునున్న ఈ బంక్ ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు ఆర్టీసీ బంక్‌లో నాణ్యతతో పెట్రోల్, డీజిల్ లభిస్తుందని వాహనదారుల నమ్మకం. ఈ క్రమంలో బంక్‌లో అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. కొద్దిరోజులుగా తరచూ రిపేర్ బోర్డు కనిపిస్తోంది. నెలలో వారంరోజులే పెట్రోల్ అందుబాటులో ఉంటోంది. ఆర్టీసీ బస్సులకూ ఇదే పంపులో డీజిల్ పోయడంతో ఒక్క డీజిల్ మాత్రమే అందుబాటులో ఉంటోంది. 20 రోజులుగా పెట్రోల్ పంప్ రిపేర్ బోర్డు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి మరమ్మతు చేసి బంక్‌ను అందుబాటులోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం శ్రీధర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ట్రా'ఫికర్'



ఇది జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్. చిరు వ్యాపారులు రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో వినియోగదారులు, ప్రయాణికులతో ఈ చౌరస్తా రద్దీగా మారుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని మార్కెట్. నిత్యం రద్దీగా ఉండే ఈ ఏరియాలో చిరు వ్యాపారులు తోపుడు బండ్లు రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఫలితంగా రద్దీ మరింత పెరుగుతోంది. ఇలా జిల్లా కేంద్రంలోని పలు చౌరస్తాల్లో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలు

- జిల్లా కేంద్రంలో రోడ్లపైనే దుకాణాలు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు

ఆసిఫాబాద్: పేరుకే జిల్లా కేంద్రం.. ఇరుకు రోడ్లు, రహదారులపై తోపుడు బండ్లు, చిరు వ్యాపారాల నిర్వహణ ఫలితంగా పట్టణ ప్రజలకు పట్టపగలే ట్రాఫిక్ చుక్కలు కనిపిస్తున్నాయి. పట్టించుకునే వారు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక వివేకానందచౌక్, గాంధీ చౌక్‌తోపాటు ప్రధాన రహదారిపై రద్దీ కారణంగా స్థానికులకు సమస్యలు ఎదురవుతున్నాయి.

నియంత్రణ శూన్యం..

మామూలు రోజుల్లోనే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. శనివారం సంత నిర్వహణతో మరింత పెరుగుతోంది. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఆరేళ్లవుతున్నా పట్టణంలో ట్రాఫిక్‌పై నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రధాన వ్యాపార కేంద్రాలైన గాంధీ చౌక్, వివేకానంద చౌక్ ప్రాంతాల్లో చిరువ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా దుకాణాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కొంతమంది వ్యాపారులు తమ దుకాణాల ఎదుట ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా టిఫిన్ సెంటర్ల ఏర్పాటుకు అద్దెకిస్తున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారులు విస్తరించకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది.

శని, సోమవారాలు తీవ్ర రద్దీ

జిల్లా కేంద్రంలో శని, సోమవారాలు రద్దీ ఎక్కువవుతోంది. పట్టణంలో ప్రతీ శనివారం వారసంత నిర్వహిస్తారు. నాలుగు దశాబ్దాల క్రితం శనివారం వారసంతను ఏఎంసీ కార్యాలయం సమీపంలోని అంగడిబజార్‌లో నిర్వహించేవారు. అధికారుల నిర్లక్ష్యంతో క్రమంగా వారసంత పట్టణంలోని ప్రధాన మార్కెట్‌కు తరలింది. కొన్నేళ్లుగా వార సంతను వివేకానంద చౌక్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల కూరగాయల మార్కెట్‌ను కొత్తగా నిర్మించిన 'జుబ్లీ'కి తరలించినా పండ్లు, చిరుదుకాణాలు ఇక్కడే కొనసాగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకుతోడు వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మార్కెట్‌లో రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు, చిరుదుకాణాలు ఏర్పాటు చేయడంతో గాంధీచౌక్‌లో రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్‌తో కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కొంతమంది వ్యాపారులు భారీ వాహనాల్లో నిత్యం రోడ్డుకు అడ్డంగా సరుకులు అన్‌లోడ్ చేస్తున్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ

ట్రాఫిక్ నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట గుండి రహదారికి వెళ్లే దారిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోగల చౌరస్తాలో పంచాయతీ ఆధ్వర్యంలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అది కూడా నిరుపయోగంగా మారింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా వాహనదారుల్లో మార్పు కానరావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా కిష్టయ్య


నియామక లేఖ అందిస్తున్న రాష్ట్ర నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన సోగాల కిష్టయ్య నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సోగాల కిష్టయ్యను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు నియామక లేఖను అందజేశారు. గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు అవసరమైతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మ రాజు, ఉపాధ్యక్షుడు యాట సైదులు, కార్యదర్శి దమ్మ నారాయణ, జిల్లా అధ్యక్షుడు కుంభాల రాజేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి మల్లయ్య, ఉపాధ్యక్షుడు మద్దెల గోపి, నాయకులు రవికుమార్, భీమయ్య, చిన్నయ్య, తిరుపతి, మల్లయ్య పాల్గొని కిష్టయ్యను అభినందించారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య (55) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లయ్య ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు సాయంత్రం గాలించగా వ్యవసాయ బావిలో మృతిచెంది కనిపించాడు. అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీయలేదు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు


బోల్తాపడిన ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై

తాండూర్: మండలంలోని రేచినీ రైల్వే స్టేషన్ ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రైల్వే స్టేషన్‌లోనికి ఆటో వెళ్లే క్రమంలో డీసీఎం వ్యాన్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజీవ్‌నగర్‌కు చెందిన మంతెన శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ప్రజా ప్రయోజనాల కోసమే సీపీఐ పోరాటం

బెల్లంపల్లి: ప్రజా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుని సీపీఐ పోరాటం సాగిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేన శంకర్ అన్నారు. ఆదివారం సీపీఐ ప్రజా పోరు యాత్ర బెల్లంపల్లి మున్సిపాలిటీ శాంతిఖని బస్తీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా బస్తీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బెల్లంపల్లి ప్రాంతం సీపీఐకి కంచుకోటన్నారు. ఉమ్మడి ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి 3 సార్లు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఓ సారి దివంగత సీపీఐ నేత గుండా మల్లేష్ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎన్నికై రికార్డు సృష్టించారని గుర్తు చేశారు. చట్ట సభల్లో ప్రజా వాణిని వినిపించి ఎన్నో పోరాటాలకు సీపీఐ నాయకత్వం వహించిందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు ఎం.వెంకట స్వామి, చిప్ప నర్సయ్య, మేకల దాసు, బి.పూర్ణిమ, డీఆర్ శ్రీధర్, దాగం మల్లేష్, ఎం.రాజేశం ఉన్నారు.

కేటీఆర్ స్పందించాలి


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

పాతమంచిర్యాల: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, ఐకేపీ వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపుపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్పందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత ఎంపి హోదాలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమ్మె చేస్తున్న వారిని గుర్తించి వారి సమస్యలు తీర్చాలని కోరారు.

నిండుగా ప్రాణహిత



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మంచిర్యాల జిల్లాలో ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తోంది. వెంచపల్లి, జనగామ, సుపాక, అలుగామ, సిర్సా గ్రామాల్లో ప్రాణహిత నది తీరం వెంట జాలర్లు, పడవ యజమానులు తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలు నిర్మాణాలు పూర్తిగా మునిగిపోయాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతోనే ప్రాణహితలో వరద ఉధృతి పెరిగిందని సమీప గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. నీటి మట్టం పెరగడంతో రాకపోకలు నిలిపివేశారు. - కోటపల్లి

పెర్సాపేన్‌కు పూజలు



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురికాకో ఆలయంలో ఆదివాసీ గిరిజనులు ఆదివారం పెర్సాపేన్ (జల్లిదేవర)పూజలు నిర్వహించారు. ముందుగా గోదావరి నదిలో స్నానాలు ఆచరించి గోదారమ్మకు శాంతి పూజలు నిర్వహించిన అనంతరం జల్లిదేవతను పూజించారు. నది ఒడ్డున కాకో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కొత్తకోడళ్ల బేటింగ్ నిర్వహించారు. గుడిరేవు గోదావరి నదితీరంలోని పద్మల్‌పురి కాకో ఆలయం గిరిజన భక్తులతో సందడిగా కనిపించింది.

తలసేమియా చంపేస్తోంది...!


మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా బాధితులు (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో 4వేలకు పైగా బాధితులు
- దివ్యాంగులుగా గుర్తించినా.. అందని ఫలాలు
- రక్తం ఎక్కించకపోతే ప్రాణాలకే ముప్పు
- నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం

మంచిర్యాలటౌన్: తలసేమియా... ఓ ప్రాణాంతక వ్యాధి. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వేలకు పైగా తలసేమియా బాధితులు ఉన్నారు. వాస్తవానికి వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వైద్య పరీక్షలు చేస్తేగానీ ఈ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించలేక పోతున్నారు. దీంతో ఎంత మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారనే దానిపై పూర్తిస్థాయిలో లెక్కలు లేవు. తలసేమియా వ్యాధికి గురైన బాధితులు ప్రతీ పక్షం రోజులకోసారి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల జిల్లా ఆసుపత్రి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు. ఇలాంటి వ్యాధి బారినపడే వారిని కాపాడేందుకు వారికి ముఖ్యంగా కావాల్సింది రక్తమే. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం...

దివ్యాంగులుగా గుర్తించాలి...



తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను కేంద్రం 2016లో దివ్యాంగులుగా గుర్తించినా రాష్ట్ర ప్రభుత్వం జీవోను అమలు చేసేందుకు 13జూన్ 2018 లోనే దివ్యాంగులుగా గుర్తించారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్న వారికి పింఛన్ అందడం లేదు. గర్భిణులకు ముందుగానే తలసేమియా, సికిల్‌సెల్‌కు సంబంధించిన వైద్య పరీక్షలను జిల్లాలో చేయాలి. వ్యాధి నివారణకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రభుత్వం ఉచితంగా చేయాలి. ఆరోగ్యశ్రీలో, వైట్ రేషన్ కార్డుల్లో పేర్లు లేని వారికి సీఎంసీవో కార్డులను 20రోజుల వ్యాలిడిటీతో ఆదిలాబాద్‌లో ఇస్తున్నారు. మంచిర్యాలలోనూ ఈ కార్డులు ఇచ్చి వ్యాలిడిటీని ఆరు నెలలకు పొడిగించాలి.

– కాసర్ల రంజిత్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

తలసేమియా వ్యాధి లక్షణాలు... జాగ్రత్తలు

తలసేమియా.. వంశపారపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. మైనర్, ఇంటర్మీడియెట్, మేజర్ మూడు దశల్లో ఉంటుంది. తలసేమియా అల్ఫా, బీటా రెండు రకాలు. ఒక అల్ఫా చెంజ్ కానీ, ఒక బీటా చెంజ్ తగ్గినప్పుడు మైనర్ వ్యాధి ఉన్నట్లు. వీళ్ల వ్యాధిగ్రస్తులైనప్పటికీ రక్త మార్పిడి అవసరం లేదు. వీరు వ్యాధి తీవ్రతతో బాధపడరు. కానీ వారి నుంచి వారి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. ఇంటర్మీడియెట్, మేజర్స్‌లో హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) తగ్గుతుంది. వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రోగి శరీరంలో ఒక యూనిట్ రక్తం ఎక్కిస్తే ఒక గ్రాము హెచ్‌బీ పెరుగుతుంది. హిమోగ్లోబిన్ మెయింటనెన్స్ కనీసం 10.5 గ్రాములు శాతం ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతి 15 రోజులకోసారి వీరికి రక్తం అవసరం. జ్వరం రావడం, ఆకలి తగ్గడం, కామెర్లు, మూత్రం పసుపు రంగులో రావడం, ఇన్‌ఫెక్షన్ జరగడం, మనిషి ఎదుగుదల నిలిచిపోతుంది.

మంచిర్యాల బ్లడ్‌బ్యాంక్‌లో సేవలు...

ఉమ్మడి జిల్లాలోనే తలసేమియా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలను చేసేందుకు అవసరమైన అన్ని పరికరాలు మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో లభిస్తున్నాయి. తలసేమియా వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌బీఏ2 పరీక్ష చేసే హెచ్‌పీసీఎల్ మిషన్ డ్క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో అందుబాటులో ఉంచారు. సీరం అబార్ట్ ఐ 1000 ఎస్‌ఆర్ మిషన్‌ను మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీలో సింగరేణి సహకారంతో ఏర్పాటు చేయగా తలసేమియా బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఆరోగ్యశ్రీ సేవలు...

తలసేమియా వ్యాధిన పడిన వారికి ప్రతి నెలా మందులకు అయ్యే ఖర్చులను అందజేస్తే రోగికి భరోసాగా ఉంటుందని ఆరోగ్యశ్రీలో దీనిని చేర్చారు. రక్తంలో ఐరన్ పెరిగితే ఐరన్ చిలేషన్ థెరపీ మందులు ఒక్కొక్కరికి రూ.5 నుంచి 10వేల వరకు ప్రతి నెలా వాడాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ప్రభుత్వం తరుపున ఉచితంగా మందులు అందకపోవడంతో నాటి కలెక్టర్ కర్ణన్ ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారానే అన్ని రకాల మందులు, వైద్య సేవలను అందించేలా మంచిర్యాల బ్లడ్ బ్యాంక్‌లో ఆరోగ్యశ్రీ కోసం ఒక గదిని ఏర్పాటు చేశారు. మంచిర్యాల బ్లడ్‌బ్యాంకులో 190 మంది తలసేమియా, 577 మంది సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులుండగా, 83మంది ఆరోగ్యశ్రీ ద్వారా సేవలను పొందుతున్నారు. మిగిలిన వారికి బ్లడ్‌ను ఉచితంగా ఎక్కిస్తున్నారు.

మనువాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి


ఐక్యతను ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

- భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యులు గాదె ఇన్నయ్య
- భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర

పాతమంచిర్యాల: మనువాద, మతోన్మాద, ఫాసిజం శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యులు గాదే ఇన్నయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ప్రజాసంఘాల నాయకులతో భారత్ బచావో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాదే ఇన్నయ్య హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మతోన్మాద శక్తులు ప్రజాస్వామ్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను నిర్వీర్యం చేయడానికి, భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాదం తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. 2024 తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానికి ముప్పు ఏర్పడినట్లే అన్నారు. దేశ సంపదను దేశంలోని కార్పొరేట్లకు అప్పగిస్తూ దేశ కార్మికులకు, ప్రజలకు ద్రోహం చేస్తుందన్నారు. నిజమైన దేశ భక్తులు సోషలిస్టులు, కమ్యూనిష్టులు నిజమైన దేశభక్తులుగా అభివర్ణించారు. కార్యక్రమంలో భారత్ బచావో రాష్ట్ర నాయకులు జైసింగ్ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, ప్రజాస్వామ్య ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే జయకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్, స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ మంగ, భారత్ బచావో ఎగ్జిక్యూటివ్ సభ్యులు వడ్డెపల్లి మనోహర్, సమ్మ రాజయ్య ఉన్నారు.

ప్రశాంతంగా నీట్

మంచిర్యాలఅర్బన్: వైద్యకళాశాల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20వరకు జరిగిన పరీక్షా కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1447 మంది విద్యార్థులకు 1430 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. ప్రతి సెంటర్ వద్ద ప్రతిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాట చేశారు. ఉదయం 11.00 గంటల నుంచి పరిశీలించిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరువేశారు. 1.30 తర్వాత పరీక్షా కేంద్రాల గేట్ మూసివేశారు. చెన్నూర్ సమీప గ్రామానికి చెందిన ఓ విద్యార్థి సమయం దాటిపోతుండడంతో తన తండ్రి, చెల్లితో కలిసి కొద్ది దూరం పరుగెత్తుకుంటూ వచ్చింది. నిమిషం అటు ఇటుగా సమయం దాటిపోవడంతో గేట్ ముందర నిల్చోని ప్రాధేయపడటంతో ఉన్నతాధికారులతో మాట్లాడి లోపలికి అనుమతించారు. గోదావరిఖని నుంచి వచ్చిన మరో విద్యార్థికి ఆలస్యంగా రావటంతో వెనుదిరిగాల్సి వచ్చింది. పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు సిటీ కో–ఆర్డినేటర్ రేషమ్మ ఎ.ఎస్ తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పరీక్ష రాయాల్సిన విద్యార్థులు	1447
గైర్హాజరైన విద్యార్థులు	17

పిల్లల కోసం తల్లులు ..

నీట్ రాయటానికి వచ్చిన పిల్లలకు తోడు తల్లులు వచ్చారు. దూరప్రాంతం నుంచి వచ్చిన మహిళలు విద్యార్థులు పరీక్షా రాసి వచ్చేంత వరకూ ఆయా కేంద్రాల వద్ద ఉండిపోయారు. ఇంకోవైపు ఆకాశ్ ఇనిస్టిట్యూట్‌కు సిబ్బంది తన సంస్థకు చెందిన కరపత్రాలు అందజేస్తూ.. మరో చేతితో వాటర్ బాటిల్ ఇస్తూ దాహం తీర్చారు.


పరీక్ష రాసేందుకు పరుగులు పెడుతున్న విద్యార్థిని


విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

కట్టుబట్టలే మిగిలాయి..

- అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం
- విద్యుత్ తీగలతో ప్రమాదం
- రూ.13 లక్షల వరకు ఆస్తినష్టం
- పేలిన రెండు ఇళ్లల్లో సిలిండర్లు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండరే నాందేవ్, బెండర్ వాగు ఇద్దరు అన్నదమ్ముళ్ల రెండు ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. నాందేవ్ తన పొలంలో పంటకు కావాలికి వెళ్లాడు. భార్య, ఇద్దరు పిల్లలు, వాగు అతడి భార్య, ఇద్దరు పిల్లలు గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి వచ్చి వారు పడుకున్నారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు అంటుకొని నిప్పు రవ్వలు నాందేవ్ ఇంటి ముందు ఉన్న ఎద్దుల కొట్టంపై పడ్డాయి. ఒక్కసారిగా మంటలు అంటుకుని ఇంటికి సైతం అంటుకున్నాయి. గమనించిన స్థానికులు ఇంట్లో నిద్రపోతున్న వారిని బయటకు తీసుకొచ్చారు. మంటలు వ్యాపించడంతో నాందేవ్, వాగు ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నాందేవ్ ఇంట్లోని రూ.1.50 లక్షలు, 4తులాల బంగారం, 14 తులాల వెండి, 40 క్వింటాళ్ల ధాన్యం, కందులు, పేసర్లు, పట్టాపాసు బుక్‌లు, బ్యాంకు బుక్‌లు, విలువైన పత్రాలు, బీరువా, టీవీ, కూలర్, ఇతర విలువైన వస్తువులు కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ చేరుకుని మంటలు ఆర్పివేసింది. అప్పటి వరకు స్థానికులు నీటితో ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. సంఘటన స్థలాన్ని కౌటాల సీఐ సాధిక్ పాషా పరిశీలించారు. ఈ ప్రమాదంలో నాందేవ్ ఇంట్లో రూ.8లక్షల ఆస్తినష్టం , వాగు ఇంట్లో రూ.5 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు.


మంటల్లో కాలిపోతున్న ఇళ్లు

కల్లాల్లో గన్నీలు.. మిల్లుల్లో ప్రత్యక్షం


మిల్లుల్లోని గన్నీ సంచులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుల ధాన్యం కొనుగోలు చేసేందుకు కల్లాల్లో ఉండాల్సిన గన్నీ సంచులు రైస్‌మిల్లుల్లో దర్శనమిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం కొత్త గన్నీ సంచులు సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో ఓ వైపు అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి పోవడమే కాదు ధాన్యం మొలకెత్తి మరీ రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో గన్నీ సంచులు, లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇంతటి కష్టకాలంలో రైతులకు గన్నీ సంచులు అందుబాటులో ఉంచి ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాల్సి ఉండగా, రైతులు సంచులు లేక ఇబ్బంది పడుతున్నారు. హాజీపూర్ మండలంలోని ఓ మిల్లులో మాత్రం పెద్దెత్తున గన్నీ సంచులు దర్శనమిస్తున్నాయి. పర్దనపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి చెందిన కొత్త గన్నీ సంచులు రైస్‌మిల్లులో దించి అందులోని పాత గన్నీ సంచులు పీఏసీఎస్‌కు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం





జైపూర్: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2012-13 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరీత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ ఒక చోట కలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుబాగిని, మానిక్, శర్ఫోద్దీన్, వెంకటేశ్వర్‌రావు, నర్మద శిరీష, మాదవి, నర్సింహారెడ్డిలను శాలువాలతో సన్మానించారు.

తాండూర్ : మండల కేంద్రం మినీ సురభి గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువ కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు విజిత్‌రావు, పురుషోత్తం, రాజయ్య, బాబురావు, అనిల్ ఉన్నారు.